క్లుప్తంగా

కార్యసిద్ధి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఆంజనేయుడు

శ్రీకాకుళం కల్చరల్: ఫాజుల్‌బాగ్‌పేటలోని సంజీవనీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక అర్చనలు, పూర్ణఫలాల సమర్పణలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శ్రీకోట ఆంజనేయస్వామి ఆలయంలో నిమ్మకాయలతో అష్టోత్తర శతనామాల పూజలు నిర్వహించారు. పాతశ్రీకాకుళంలో పంచముఖాంజనేయ ఆలయంలో స్వామికి సింధూరార్చనలు జరిగాయి.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని నక్కవీధి ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అభిషేకాలు, అర్చనలు చేశారు. అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

వైఎస్సార్ పార్కు పనుల పరిశీలన



పార్కు పనులను పరిశీలిస్తున్న ఏఈఈ పోలినాయుడు

జి.సిగడాం: మండలంలోని సంతవురిటిలో నిర్మిస్తున్న వైఎస్సార్ పార్కు పనులను పంచాయతీరాజ్ ఏఈఈ ఎస్.వి.ఎ.పోలినాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం నిర్మిస్తున్న ఈ పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ భవనాల పనులను సైతం శరవేగంగా పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే సచివాలయాలు, ఆర్‌బీకే భవనాల పనులు పూర్తి చేశామన్నారు. ఆయనతోపాటు సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, ఉపసర్పంచ్ చందనాల గణపతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాషా నాగరాజు, బాలబొమ్మ సీతారాంబాబు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



శిగురుకొత్తపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

లావేరు: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని బెజ్జిపురం, లావేరు పశువైద్య కేంద్రాల పశువైద్యులు డాక్టర్ జి.లావణ్య, డాక్టర్ బి.గాయత్రి సూచించారు. మంగళవారం వెటర్నరీ అసిస్టెంట్లు, సిబ్బంది పశువైద్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో పాడి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యులు మాట్లాడుతూ పాడిరైతులు టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మామిడి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి చెరువు హద్దుల గుర్తింపు



హద్దులు గుర్తిస్తున్న అధికారులు

జి.సిగడాం: ముషివలస పంచాయతీ పరిధిలోని ఉజ్జివాని సాగునీటి చెరువు హద్దులను మంగళవారం గుర్తించారు. సర్పంచ్ చందక సతీష్ సమక్షంలో సర్వేయర్ మొయ్యి ఈశ్వరరావు కొలతలు వేసి హద్దులు నిర్ణయించారు. ఆక్రమణలను అరికట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో సర్వేయర్లు ఇజ్జి చంద్రశేఖర్, రమణ, నాయకులు గుడివాడ నాగేశ్వరావు, యడ్ల భాస్కర్ యాదవ్, సూర్యనారాయణ, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.



జి.సిగడాం: నుల్లిపురుగుల నివారణ మాత్రల ఆవశ్యకతను వివరిస్తున్న సిబ్బంది



ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీపీ చిరంజీవి

నులి పురుగులను నివారిద్దాం



లావేరు హైస్కూల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా మంగళవారం మంగళవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామాల్లోనూ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. లావేరు, మురపాక పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాల ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు మధ్యాహ్న భోజనం అనంతరం 1 నుంచి ఐదేళ్ల పిల్లలకు, 6 నుంచి 19 ఏళ్లలోపు వారికి మాత్రలు అందజేశారు. లావేరు, మురపాక పీహెచ్‌సీ వైద్యులు కె.జగదీష్, టి.సౌమ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేయడం వల్ల రక్తహీనతను నివారించడం, పోషకాల గ్రాహ్యతను మెరుగుపరచడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత..

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఫరీదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆల్బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలపై నులిపురుగులు తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. మాత్రలు వేసుకుంటే సమస్యను అధిగమించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.నారాయణమూర్తి, స్కూల్ కమిటీ చైర్మన్ సత్తారు గోపి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల మాత్రలు వేసుకోవాలి

రణస్థలం: పిల్లలంతా నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ఎంపీడీఓ వండాన ధనుంజయరావు అన్నారు. లంకపేట కేజీబీవీ, రణస్థలం, కొండములగాం అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా 19 ఏళ్ల లోపు వారికి అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాత్రలు వేసుకోవడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు.రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు దూరమవుతాయని చెప్పారు. రాబోయే రోజుల్లో ఎండలు అధికంగా ఉండే అవకాశమున్నందున మంచినీరు ఎక్కువగా తాగాలని సూచించారు. కార్యక్రమంలో లంకపేట కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్.హైమావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు డీవార్మింగ్ మాత్రలు..

జి.సిగడాం: మండల పరిధిలో అన్ని పాఠశాలల్లోనూ బాలబాలికలకు మంగళవారం డీవార్మింగ్ మాత్రలు మింగించారు. స్థానిక వైద్యాధికారి పొన్నాడ హరితశ్రీ ఆధ్వర్యంలో కేజీబీవీ, మోడల్‌స్కూల్, ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులతో నుల్లిపురుగు నివారణ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక, ఉషారత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు..

శ్రీకాకుళం రూరల్: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రాగోలు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో మెడికల్ సిబ్బంది పర్యవేక్షణలో నులి పురుగుల మాత్రలు మింగించారు.



రణస్థలం: కొండములగాం అంగన్‌వాడీ కేంద్రంలో మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ ధనుంజయరావు



శ్రీకాకుళం రూరల్: నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న సిబ్బంది

నిర్మలకు కలెక్టర్ అభినందన



నిర్మలను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గార మండలం శ్రీకూర్మం గ్రామానికి చెందిన ఆంధ్రప్రదేశ్ జెండర్ సోషల్ యాక్షన్ కమిటీ సభ్యురాలు నిర్మల ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు హాజరై ట్రైనీ ఐఏఎస్‌లతో ఇటీవల సమావేశమయ్యారు. అనంతరం ఉత్తరాఖండ్ గవర్నర్‌తో సంభాషించారు. అనంతరం జిల్లాకు తిరిగి వచ్చిన ఆమె మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. ట్రైనీ ఐఏఎస్‌లతో మాట్లాడిన అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఆమెను అభినందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

సూర్యారావుకు సత్కారం



ఎన్ని సూర్యారావును సత్కరిస్తున్న వాకర్స్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సీనియర్ న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావుకు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా మంగళవారం పీఎస్‌ఎన్‌ఎం హైస్కూల్ వాకర్స్ సభ్యులు ఓ ప్రైవేటు హోటల్‌లో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కొంక్యాన సుభాష్, కురుమోజు శంకరరావు, సాహుకారి వెంకటరావు, మజ్జి సంపత్‌కుమార్, టి.ఖగేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు సత్కారం



మహిళా టీచర్లను సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని డి.ఆర్.వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులకు మంగళవారం హెచ్‌ఎం తురక బలరాం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో 12 మంది మహిళా ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో వీరిని సత్కరించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సామగ్రి పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: గార మండలం శ్రీకూర్మం పంచాయతీ ఒనుమువానిపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు రెడ్‌క్రాస్ ప్రతినిధులు మంగళవారం సాయం అందించారు. నిరాశ్రయులైన పల్లి అప్పలరామయ్య, ఆవాలు లక్ష్మీ, వనుము నీలమ్మ కుటుంబాలను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పరామర్శించారు. తక్షణ సాయం కింద వంట సామగ్రి కిట్లు, ఆహార ధాన్యాలు, టార్పాలిన్, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు చిన్నయరావు, కె.సత్యనారాయణ, జి.పవన్‌కుమార్, వి.మదీన, సచివాలయ వీఆర్‌వో జగదీశ్వరరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు ఇంజినీర్ల అభినందనలు



కమిషనర్‌ని అభినందిస్తున్న లైసెన్సుడ్ ఇంజినీర్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసుకు రీజనల్ డైరెక్టర్ అప్పిలేట్ కమిషనర్‌గా పదోన్నతి వచ్చిన నేపథ్యంలో లైసెన్స్‌డు ఇంజినీర్స్ అసోషియేషన్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు ముని శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్న కమిషనర్‌కి తగిన పదోన్నతి లభించడం హర్షనీయమన్నారు. కొత్తగా ఎల్‌టీపీలకు లైసెన్సులు జారీచేసి ప్రోత్సహించారన్నారు. సర్క్యులేషన్ ప్యాట్రన్ అప్రూవల్ కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు దుంగ సుధాకర్, డి.వి.రమణ, ఎన్ని జగదీష్, కోరాడ ప్రదీప్, చల్ల నరేష్ పాల్గొన్నారు.

దంత సమస్యలపై అవగాహన అవసరం



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో దంత వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రజలు దంత సమస్యలపై కనీస అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డెంటల్ హెచ్‌వోడీ డాక్టర్ వి.వరప్రసాదరావు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సంస్థ ఉద్యోగులకు, ప్రయాణికులకు దంత సమస్యలు, నోటి క్యాన్సర్ ముందస్తు నివారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు, గుట్కా వంటివాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రతిరోజూ ఉదయం , రాత్రి తప్పనిసరిగా బ్రష్ చేయాలన్నారు. కార్యక్రమంలో రిమ్స్ డెంటల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రూప, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జనార్దన, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ నిహారిక, డెంటల్ హైజనిస్ట్ శ్రీకళ, డెంటల్ టెక్నీషియన్ కె.శ్రీనివాసరావు, ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు కె.మాధవ్, కేఎస్‌ఆర్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు రమేష్, గంగరాజు, ఎస్‌ఎం వి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



● సీఎంను కలిసిన ఎం.వి.పద్మావతి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి అమరావతిలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడేవారికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

పర్యాటక అభివృద్ధికి సహకరించాలి



యువక్లబ్ సభ్యులతో అంధవరపు సూరిబాబు, పర్యాటక అధికారి నారాయణరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రతిఒక్కరూ ముఖ్యంగా యువత, విద్యార్థులు సహకరించాలని జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు కోరారు. జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించి పర్యాటకులను తీసుకొచ్చేందుకు 'యువ' పర్యాటక క్లబ్‌లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని అరసవల్లి రోడ్డులో ఉన్న శర్వాణి విద్యాలయంలో మంగళవారం యువ పర్యాటక క్లబ్‌ను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతు ప్రపంచంలోనే కీర్తికలిగిన ఆలయాలు, ప్రదేశాలు సిక్కోలు సొంతమని, వాటికి యువ క్లబ్‌ల ద్వారా పర్యాటకుల తాకిడి పెంచాలని చెప్పారు. శర్వాణి విద్యాసంస్థల అధినేత అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ జిల్లా పర్యాటక శాఖ నిర్వహించే కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. ఎన్‌వైకే యూత్ కో–ఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ చిరుధాన్యాల వినియోగాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ రేఖ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక విజ్ఞానంతో పాటు సమాజ విజ్ఞానం అవసరమన్నారు. కార్యక్రమలో స్కూల్ కరస్పాండెంట్ అంధవరపు అంజనేయులు, ఇంటాక్ కన్వీనర్ రాధప్రసాద్, డి.రమేష్, దేవేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

జి.సిగడాం : బుధవారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ సన్యాసిరావు, డిపార్ట్‌మెంట్ అధికారి నారాయణనాయుడు తెలిపారు. మంగళవారం జి.సిగడాం ప్రభుత్వ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 250 మంది పరీక్షలు రాసేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించామన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

ఘనంగా సాయిమందిర వార్షికోత్సవం



భజనలు చేస్తున్న సాయి భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని హయాతినగరంలో సత్యసాయి భజన మండలి 21వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. మందిర కన్వీనర్ కిల్లాన భోజ్‌కుమార్, కిల్లాన ఫల్గుణరావుల ఆధ్వర్యంలో భజన పాటలు, బాల వికాస్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం అమృత కలశాలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో టీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా బాబా చెప్పిన బాటలో అందరూ నడవాలని కోరారు. కార్యక్రమంలో మందిర సభ్యులు కిల్లాన మధవరావు, కె.వెంకటరావు, పెద్దమందిరం, పీఎన్‌కాలని మందిరం సభ్యులు పాల్గొన్నారు.

గుమడాంలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

లావేరు: మండలంలోని గుమడాంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ జి.పైడయ్య, ఉప సర్పంచ్ దురగాసి ధర్మారావు పారిశుద్ధ్య కార్మికులతో పూడికలు తీయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

సకాలంలో విద్యుత్ సమస్యల పరిష్కారం

● సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ

నరసన్నపేట: విద్యుత్ పంపిణీ సంస్థ అందిస్తున్న సేవలకు నిర్ణీత కాల పరిమితిని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి నిర్దేశించిందని, దీని ప్రకారం విద్యుత్ సౌకర్యాలు వినియోగదారులు పొందవచ్చని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) చైర్మన్ (విశ్రాంత న్యాయమూర్తి) బి.సత్యనారాయణ అన్నారు. నరసన్నపేటలో మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార న్యాయస్థానం వేదికను నిర్వహించారు. ఏడు సమస్యలను స్థానికులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా విద్యుత్ సమస్యలు సకాలంలో సులువుగా పరిష్కారవుతాయన్నారు. వినియోగదారులు ఈ న్యాయస్థానాన్ని వినియోగించుకోవాలన్నారు. సమస్యలను రాతపూర్వకంగా ఇవ్వాలన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1912కి ఫోన్ చేసి, అనంతరం లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చన్నారు. వచ్చిన ఫిర్యాదులను రెండు నెలల్లో పరిష్కరిస్తామన్నారు. సమస్య రెండేళ్లలోపుదై ఉండాలన్నారు. 2023లో ఇప్పటివరకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 13 సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వీటిలో 10 సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ న్యాయ స్థానం సేవలను మరింతగా వినియోగించుకోవాలని కోరారు. బిల్లులో లోపాలు, విద్యుత్ తీగల మరమ్మతులు, మీటర్లు కాలిపోవడం , విద్యుత్ ఓల్టేజీ హెచ్చుతగ్గులు, విద్యుత్ మీటర్లలో లోపాలు, కొత్త విద్యుత్ సర్వీసులు వంటి సమస్యలతోపాటు పలు సమస్యలు తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. తొలిత స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిష్కార వేదిక సభ్యులు ఎస్.హరిబాబు, పి.శ్రీనివాస్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ పర్యటనకు గిరిజన యువత

బూర్జ: ఛత్తీస్‌గఢ్ పర్యటనకు మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ నుంచి 50 మంది ఆదివాసీ యువతను సంస్థ ఆధ్వర్యంలో పంపించడం జరిగిందని డైరెక్టర్ నూక సన్యాసిరావు తెలిపారు. పెద్దపేట నుంచి బయలుదేరిన వాహనాలను మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లాలో నివేదిత ఫౌండేషన్ వారు అమలు చేస్తున్న ఆదివాసీ సుపరిపాలన, సాధికారత, సంప్రదాయాలు, గిరిజన సాంస్కృతి, అటవీ హక్కుల చట్టం, గిరిజనుల జీవన విధానం క్షేత్రస్థాయిలో చూపించి అవగాహన కల్పిస్తామన్నారు.